క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు



రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీడీపీఓ దయామణి

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ఉద్యోగులు అలసత్వం వహించొద్దని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. శుక్రవారం మండలంలోని పండితాపురం సెకార్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు భోజనానికి హాజరు కావడం లేదని, భోజనాల సంఖ్యలో తేడాలున్నాయని, ప్రతి రోజు రిజిస్టర్, ఆన్‌లైన్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించినట్లు తెలిపారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు ఇచ్చినట్లు తెలిపారు.

అరెస్టులు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: కేసీఆర్ మీటింగ్ ఉందని పాలేరు డివిజన్ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులను అరెస్టు చేయడం పోలీసుల దుర్మార్గపు చర్య అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ మీటింగ్ ఉంటే బందోబస్త్ నిర్వహించుకోవాలని, ఇలా తమ పార్టీతో పాటు ఇతర పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

బచ్చోడు మండల సాధన కమిటీ నాయకుల అరెస్టు..

తిరుమలాయపాలెం: ముఖ్యమంత్రి కేసీఆర్ జీళ్లచెరువు మీటింగ్ నేపథ్యంలో బచ్చోడు మండల కేంద్రం కోసం ఆందోళనలకు పాల్పడతారని పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయిన వారిలో మండల సాధన సమితి నాయకులు తిమ్మిడి హన్మంతరావు, గొర్రెపాటి రమేష్, ఉపేందర్, ఎన్నెబోయిన శ్రీనివాసరావులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు చెందిన పోతురాజు సుగుణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా శుక్రవారం రూ.9వేలతో పాటు 50 కేజీల బియ్యంను అందించినట్లు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి నర్సింహారావు తెలిపారు. కల్యాణపు నర్సయ్య, వార్డ్ సభ్యులు మంద గోపి, మంద నాగ, కేలోతు సురేశ్, ఇంజమమ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన అభ్యర్థులే ప్రత్యామ్నాయం



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతాలు

ఖమ్మంరాపర్తినగర్/ఖమ్మంమామిళ్లగూడెం: ఒక కమ్మ అభ్యర్థికి మరో కమ్మ అభ్యర్థి ప్రత్యామ్నాయం కాదు, బహుజన అభ్యర్థులే ప్రత్యామ్నాయమని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి పాడకంటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఖానాపురం హవేలీ ఆఫీసులో మిట్టగోల దినేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ ఖమ్మం నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంలో తరతరాలుగా నివశిస్తున్న బహుజన జాతులను ఆర్థికంగా, సామాజికంగా అణచివేయడమే కాకుండా రాజకీయ కుర్చీని కూడా తాకకుండా బహుజనులను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్మ కుల రాజకీయ ఆధిపత్యాన్ని కూల్చి అణగారిన కులాల రాజ్యం రావడం కోసం బహుజన బిడ్డ, ఖమ్మం అభ్యర్థి లిక్కి కృష్ణారావు యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత బహుజన జాతులపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాదు మాల్యాద్రి, లిక్కి కృష్ణారావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

నేలకొండపల్లి: ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేంత వరకూ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని బోదులబండ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేరు కాంగ్రెస్ అడ్డా అని, కాంగ్రెస్‌ను ఢీకొట్టే సత్తా బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మరోమారు మోసం చేస్తున్నారని ఆరోపించారు. వారి మాయమాటలను ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మీసా ముత్తయ్య, ఎంపీటీసీ కట్టికోల సుధాకర్, నాయకులు మీసా నాగేశ్వరరావు, నెల్లూరి భద్రయ్య, ప్రకాశ్‌రావు, పొట్టపింజర రవి, ఖాజామియా, ఆర్.శ్రీనివాస్, అనంతు నాగేందర్, గుండు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ముందడుగు..!



శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్ రెడ్డి



కంప్యూటర్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు



బ్యూటీషియన్‌లో మెళకువలు నేర్పుతున్న శిక్షకురాలు

ఉపాధినిచ్చే కోర్సులకు పెరుగుతున్న ఆదరణ

- కోర్సు పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడుతున్న అభ్యర్థులు
- స్వయం ఉపాధితో ముందుకెళ్తున్న మరికొందరు
- సర్దార్‌పటేల్ స్టేడియంలో ముగిసిన వృత్తి నైపుణ్య శిక్షణ
- సర్టిఫికెట్లు జారీ చేసిన డీవైఎస్ఓ

ఖమ్మం స్పోర్ట్స్: ఎంత చదివినా.. ఎన్ని కోర్సులు చేసినా.. విద్యార్థి అంతిమ లక్ష్యం దాని ద్వారా ఉపాధి పొందడమే. అది కల్పించాల్సిన బాధ్యత పాలకులదే. అందులో భాగంగా జిల్లా వృత్తి శిక్షణ నైపుణ్యం కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గత వంద రోజులుగా శిక్షణ పొందుతున్న వారి శిక్షణ శుక్రవారం ముగిసింది. స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుంది. దీని ద్వారా శిక్షణ తీసుకున్నవారు ఇప్పటికే పలు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లలో ఉద్యోగాలు పొందడమే కాకుండా మరికొంతమంది స్వయం ఉపాధి రంగాలో స్థిరపడ్డారు. వృత్తి నైపుణ్యం కోర్సులైన కంప్యూటర్, బ్యూటీషియన్, కుట్టు మిషన్, ఎయిర్ కండీషన్‌లలో శిక్షణలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 510మంది శిక్షణ పొందగా ఇందులో అత్యధికంగా ఉద్యోగాలు పొందుతూ తమ కుటుంబాలకు అసరాగా ఉంటున్నారు. అయితే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి హాజరై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశాక.. పూర్తి వివరాలకు 99482 07271 నంబర్‌ను సంప్రదించాలని డీవైఎస్ఓ కోరారు. కాగా, ఆయా విభాగాల్లో శిక్షణ ఇచ్చిన వారు, శిక్షణ పొందిన అభ్యర్థుల అభిప్రాయాలు వారిమాటల్లోనే..

కంప్యూటర్ శిక్షణపై ఆసక్తి కనబరుస్తున్నారు..



స్వయం ఉపాధి కింద అత్యధికంగా కంప్యూటర్ శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన చాలమందికి ఇప్పటికే ఉద్యోగాలు పొందడంతో పాటు స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడ్డారు. అయితే విస్తృత ప్రచారం లేక ఆశించిన స్థాయిలో నిరుద్యోగ యువత రాలేకపోతున్నారు.

– కె.చందన, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్

బ్యూటీషియన్ కోర్సుకు ఆదరణ..



మహిళలకు అందం అంటే ఎంతో ఆసక్తి. దానిని దృష్టిలో పెట్టుకుని మహిళలు బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు వస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నగరాల్లో బ్యూటీషియన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఇలా ఉపాధి పొందుతుంటే చాలా సంతోషంగా ఉంది.

– ఆర్.శైలజ, బ్యూటీషియన్ ఇన్‌స్ట్రక్టర్

శిక్షణ తీరు బాగుంది..



కంప్యూటర్ శిక్షణ తీరు బాగుంది. కంప్యూటర్‌లో చాల రకాల కోర్సుల్లో శిక్షణ పొందాను. ఇక్కడి శిక్షకురాలు మంచి మెళకువలతో ట్రైనింగ్ ఇచ్చారు. కంప్యూటర్‌లో ప్రభుత్వం ద్వారా ఉద్యోగం పొందాలని ఉంది. ఉద్యోగం వచ్చే వరకూ మా కుటుంబ అవసరాల కోసం ప్రైవేటుగా ఉద్యోగం చేయాలని ఉంది.

– పి.యమినిరాణి, కంప్యూటర్ అభ్యర్థి

బ్యూటీపార్లర్ ఏర్పాటు చేస్తా..



మా ఇంటి దగ్గరే బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని డబ్బులు సంపాదిస్తా. బ్యూటీషియన్ కోర్సులో పెళ్లి కూతురు ఏ విధంగా తయారు చేయాలి.. సాధారణ ఫంక్షన్లకు మహిళలను ఏ విధంగా తయారు చేయాలనే దానిపై బాగా నేర్చుకున్నా. దీని ద్వారా సంపాదించిన డబ్బులతో మా కుటుంబ అవసరాలు తీర్చుకుంటా.

– ఆర్.మౌనిక, బ్యూటీషియన్ అభ్యర్థి

నా జీవితం తెరిచిన పుస్తకం..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కార్పొరేటర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: నా జీవితం తెరిచిన ఒక పుస్తకం అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో 42వ డివిజన్ కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల, శేషగిరి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాకు వచ్చిన ప్రతీ అవకాశాన్ని జిల్లా అభివృద్ధి కోసమే ఉపయోగించానన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్‌లు మాట్లాడుతూ.. మీము బందిపోటులా కాకుండా పట్టపగలే కాంగ్రెస్ పార్టీలో కార్పొరేటర్‌ను చేర్చుకున్నామని, రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతారన్నారు. నువ్వేదో ఈ ఒక్క పార్టీలోనే ఉన్నట్లు తుమ్మలను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్పొరేటర్ విజయనిర్మల, శేషగిరిలు మాట్లాడుతూ.. మాకు రాజకీయ జన్మను ఇచ్చిందే తుమ్మల, బాలసానిల బాటలో నడుస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, చావా నారాయణ రావు, సాధు రమేశ్‌రెడ్డి, పాదిల రవికుమార్, మిక్కిలినేని నరేందర్, కొత్తా సీతారాములు, ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం నగరంలోని మాజీ ఖమ్మం ఎమ్మెల్యే యూనిస్ సుల్తాన్, బొమ్మ ఇన్‌స్టిట్యూట్ అధినేత బొమ్మ రాజేశ్వరరావు, బొమ్మ రాములు తదితరులను తుమ్మల కలిసి మద్దతు కోరారు. అంతేకాక గుండెపోటుతో మృతి చెందిన గ్రానైట్ పరిశ్రమ యజమాని గద్దె విజయ్‌కుమార్(51) మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, చావా నారాయణరావు, పోట్ల వీరేంద్రర్, జంగం భాస్కర్, పలువురు గ్రానైట్ వ్యాపారులు, నాయకులు పాల్గొన్నారు. అంతేకాక నగరంలోని 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. ఈ నెల రోజులు కష్టపడి తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు మీకోసం, ప్రశాంతమైన వాతావరణం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో చోటాబాబు, సాధు రమేశ్‌రెడ్డి, తిరుమలరావు పాల్గొన్నారు.

మండలాల్లో ప్రసాద్‌రెడ్డి విస్తృత పర్యటన



నేలకొండపల్లి: పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండా గ్రామంలో పంచాయతీ 10వ వార్డు సభ్యురాలు భూక్యా పద్మతో పాటు గోపి, చిన్న గోబ్రియా, పాండు, నరేందర్, లాలు, గోండ్యాలి, వెంకటేశ్, వెంకటప్రసాద్‌లతో పాటు పలు కుటుంబాలు జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మస్తాన్, పార్టీ నాయకులు ధారావత్ బాలాజీ, తేజావత్ కోటేశ్వరరావు, భూక్యా సీత్యా, భూక్యా చిన్నా నాయక్, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని టీఎన్జీవోస్ కాలనీలోని అమరలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కోటి శివలింగార్చన వేడుకలో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, సోము వెంకటరెడ్డి, తిపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కేవీ చారి, గోపి, పి.ప్రభాస్, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుసులూరి రమేశ్‌బాబు ఖమ్మంలో ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ యువనేత పొంగులేటి హర్షరెడ్డి, చావా శివరామకృష్ణ ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో పొంగులేటి కుటుంబ సభ్యులు..

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబసభ్యులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని గణేశ్ టౌన్‌షిప్‌లో శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, నేలకొండపల్లి మండలం చెన్నారం, అమ్మగూడెంలో సోదరుడు ప్రసాద్‌రెడ్డి, రూరల్ మండలం కరుణగిరిలో ప్రసాద్‌రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి, తిరుమలాయపాలెం మండల కేంద్రంలో శ్రీనివాసరెడ్డి తనయుడు శ్రీహర్షారెడ్డి శుక్రవారం రాత్రి ప్రచారం చేశారు. శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. అన్ని గ్రామాల్లో వారికి ప్రజలు హారతి ఇస్తూ ఘనస్వాగతం పలికారు.

అట్టహాసంగా ఆర్జేసీ కుమార్తె నిశ్చితార్థ వేడుక



నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఆర్జేసీ, ఎస్‌బీఐటీ విద్యా సంస్థల అధినేత, బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ(ఆర్జేసీ కృష్ణ), కవిత దంపతుల కుమార్తె ధాత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అవనిగడ్డకు చెందిన వ్యాపారవేత్త కడవకల్లు నరసింహారావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు చైతన్య వివాహ నిశ్చాతార్థ వేడుక శుక్రవారం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వసంతలక్ష్మి దంపతులు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు లావుడ్యా రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, ఆంధ్రప్రదేశ్ మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ చీఫ్ విప్ సామినేని ఉదయభాను, శాసన సభ్యులు పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబులు ఉండగా.. ఖమ్మం మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు దోరేపల్లి శ్వేత, పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వర్లు, విద్యావేత్తలు శ్రీధర్, లక్ష్మణ్, వెంకటరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠామహోత్సవం



మండ్రాజుపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లిలో శుక్రవారం నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠామహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు ఈ వేడుకను తిలకించేందుకు రాగా.. వేద పండితులు మంత్రోచ్చరణ నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్ నెల్లూరి అనురాధ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పని చేస్తున్నా..

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఖమ్మం అభివృద్ధికి నిస్వార్థంగా పని చేశానని, మంత్రిగా అయిన ఈ నాలుగేళ్లల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలను కల్పిస్తూనే సంక్షేమ పథకాలను వారిదరికి చేర్చానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని 26వ డివిజన్ చర్చి కాంపౌండ్‌లోని పీస్ కమిటీ చైర్మన్ పల్లా రాజశేఖర్ ఆధ్వర్యాన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి ఆగకూడదనేది తన అభిమతం అని అన్నారు. క్రిస్టియన్ సంస్థలకు సంబంధించిన భూములు, చర్చిలకు అండగా నిలబడ్డానని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, రాంబ్రహ్మం, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బిషప్ కొడిరెక్క పద్మారావు, ఏర్పుల కిషోర్, సురేష్, సుధాకర్, పల్లా కిషోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని పుర ప్రముఖులైన దడా గురవయ్య, దండా సత్యవతి, దొండపాటి వెంకటేశ్వర్లు, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, పంది హనుమంత్‌రావు, ఆళ్ల సత్యనారాయణ, దిరిశాల వెంకటేశ్వరరావు, కమతం రామారావు, కొండేటి గోపి, డాక్టర్ బత్తుల సరోజ తదితరులు కలిసి మద్దతు కోరారు. అలాగే మంత్రి పువ్వాడ గెలుపును కాంక్షిస్తూ ఆయన తనయుడు పువ్వాడ నయన్‌రాజ్ సర్దార్‌పటేల్ స్టేడియంలో వాకర్స్‌ను, క్రీడాకారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యువజన ఎస్.సతీష్, పి.శ్రీకాంత్, పునుకొల్లు పృథ్వి, కూరాకుల వెంకటేశ్వర్లు, ఎస్.గోపిసందేశ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీ రామరక్ష



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్

కామేపల్లి: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వెనకబడిన ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచారని, కామేపల్లి మండలంలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. బాసిత్‌నగర్ పంచాయతీలోని పూసలతండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, ఎంపీపీ బానోత్ సునీత, నాయకులు ఆంతోటి అచ్చయ్య, సామా మోహన్ రెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, పులసం జయమ్మ, నాగమణి, జాటోత్ జాయ్‌లూసీ, గుగులోత్ గబ్రూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలతో పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్‌కు చెందిన బలహీన వర్గాల కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, డబ్బుల సంచులు ఇచ్చి కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీలో చేర్చుకుంటున్నారని నగర మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేటర్లను, నాయకులను ప్రలోభ పెట్టి పార్టీలోకి తీసుకుని వారితో ఫొటో దిగి సోషల్ మీడియాలో పెడితే గొప్ప అయిపోరని విమర్శించారు. పాకాలపాటి విజయ నిర్మల, శేషగిరి గతంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయినా.. మంత్రి పువ్వాడ కార్పొరేటర్‌గా గెలిపించారని అన్నారు. కార్పొరేటర్లు మారినా ప్రజలు, కార్యకర్తలు పువ్వాడ అజయ్‌కుమార్ వెంటే ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పల్లా రోజ్‌లీనా, దాదె అమృతమ్మ, దోన్‌వాన్ సరస్వతి, రవి, కన్నం ప్రసన్న కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీళ్లచెరువు జనసంద్రం!

పాలేరు నియోజకవర్గానికి సంబంధించి కూసుమంచి మండలంలోని జీళ్లచెరువులో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యాన ప్రజా ఆశీర్వద సభ నిర్వహించారు. సభకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. సభకు సీఎం కేసీఆర్ హెలీకాప్టర్‌లో చేరుకోగా, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ఆయన సతీమణి విజయమ్మ, కుమార్తెలు దీపిక, దీప్తి, అల్లుడు సురేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అలాగే, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ వైరా అభ్యర్థి బానోతు మదన్‌లాల్ తదితరులు కూడా సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీఎం కేసీఆర్‌కు భక్తరామదాసు విగ్రహాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్



హెలీప్యాడ్ వద్ద కేసీఆర్‌తో ఎమ్మెల్యే కందాళ కుటుంబం, మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా, వద్దిరాజు



వేదికపై అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



సభా వేదిక వద్ద సంక్షేమ పథకాల స్టాల్



వేపూరి సోమన్న బృందం ఆటాపాట

కేసీఆర్ సభకు తరలిన గులాబీశ్రేణులు

కూసుమంచి మండలం జీళ్లచెరువులో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పాలేరు నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు తరలి వచ్చారు. పలు గ్రామాల్లో ర్యాలీ తీసి ట్రాక్టర్లు, ఆటోల్లో సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. దీంతో గిరిజన మహిళల బిందెల నృత్యాలు, కొమ్ము నృత్యాల నడుమ సభా ప్రాంగణమంతా గులాబీమయమైంది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: పాటివారిగూడెం గ్రామం నుంచి బయలుదేరుతున్న పార్టీ శ్రేణులు